

# వెలిసిన చీర

''నీ చీర నాకోసారి అరువిస్తావా కోమలా? పెళ్లికి వెళ్లాలి. కొత్తది కొందామంటే డబ్బు లేదు. నచ్చిన చీరేమో వెల యెక్కువ మిడిల్ క్లాసైపాయే. కూతురేమో యెదిగిపోయింది. డిగ్రీ రాగానే చేస్తానని తండ్రీ, కంప్యూటర్ నేర్చి స్టేట్స్‌కి వెళ్లాలని కూతురూ, ''తన జీతానికి నా ఆదాయంతోడు పడాలని జాబ్ మానక నెగ్గుకొస్తుంటే చుట్టాలూ, స్నేహితులూ, యిల్లు కొందామనీ కనీసం ఫ్లాట్ కొనుక్కుందామనే ఆశ అందని మ్రావిపండే గొఱ్ఱె తోకలాగా మధ్య తరగతి కుటుంబాల ప్రగతి ఇలా వుంటుంది'' శంకరీ బాయి పనస వల్లె వేస్తున్నది.

''లోపలికి రండి వీధిలో నిలబడే పారం వల్లించటం?'' కోమల నవ్వి దారి తీయగా ఇద్దరూ లోపలికొచ్చి కుర్చీల్లో కూచున్నారు.

''యే చీరా?'' కోమల అడిగింది. శంకరీబాయి వర్ణిస్తుంటే కోమల నవ్వుతూ చూసింది.

''అదా చాలా పాతదై వెలిసిపోయింది. చీరంతా సూదితో గుచ్చినట్టు రంధ్రాలు పడ్డాయి. హంసలు వూడివస్తున్నాయి. జరీ పోగులు తెగినించుంటున్నాయి''.

''అంత విలువగల అందమైన చీర యివ్వటం యిష్టం లేక నేర్పుగా మాట్లాడుతున్నావే కోమలా'' అన్నది శంకరీబాయి.

కోమల నవ్వి లేచి వెళ్లి బెడ్‌రూమ్‌లో వున్న బీరువా తాళం తిప్పి తలుపుతీసింది. భద్రంగా వుంచిన చీర అట్టపెట్టెతో సహా తెచ్చి పై మూత తీసి శంకరీ బాయ్‌కి యెదురుగా వుంచింది.

మడతలు కదిలిస్తూ పరిశీలించింది శంకరీబాయి తలెత్తి నవ్వి, '' ఆలుమగల మధ్య వుండే ప్రేమానురాగాలు సన్నగిల్లి మాసిపోయినట్టున్నది కోమలా యీ చీర'' చీర మళ్లా యధాతథంగా మడతలుంచి, మూత పెట్టేసింది.

''బాగా పోల్చారు. ఒకనాడది కట్టుకెళ్తే, అది విందు కానీండి. పేరంటం కానీండి, అంతా ఆ చీర వంకా నా వంకా చూసేవారు. '' ఆ చీరలో నీ సోయగమంతా వెల్లడౌతోంది కోమలా!'' అనేవారు రంగు, డిజైను, మెత్తదనం, వంటి కానివుండటం మెరుపు, పమిట కమ్మీ, అంచు అన్నీ కుదిరినై సుమా'' అనేవారు. మురిసిపోయి గర్వపడేదాన్ని'' అన్నది కోమల.

''వెలగల చీరలు డ్రైక్లీనింగ్‌కి యివ్వనన్నావు. యెందుకలా అయిందీ? బిన్నీ జార్జెట్, మైసూర్ జార్జెట్, ధర్మవరం చీరెలు చాలా కాలం మన్నుతాయే?'' అన్నది శంకరీబాయి.

''కరెక్టు వుపమానం చెప్పారు. అన్యోన్యతా, అనుకూలతా, చివరికి ప్రేమ వివాహం గూడా కాలం గడిచేకొద్దీ వెలిసిన మాసిన పాత చీరల్లాగా అవుతాయి. కాల మహిమ, పరిస్థితుల ప్రాబల్యం. యెంత అణుకువ నేర్పూ ఓర్పూ చూసినా గూడా ప్రేమానుబంధాలూ మాసిపోయి వెలిసిన చీరలాగా అవుతాయి. మనుషులు మిగులుతారు. చీర మనిషి వేసిందే''.

'' ఇవాళ ఫిలాసఫర్ లాగా మాట్లాడుతున్నావే కోమలా. మొహం గూడా తీసేసింది. చిన్నబోయినట్టు కనబడుతున్నావు మరిదిగారేనా కారణం? పిల్లలు బుద్ధిమంతులేనే. మీరిద్దరూ యేరీ కోరీ చేసుకున్నారు'' అంటున్నది నవ్వించాలని.

'' ఆగండి. పూర్తి చేయద్దు. యేరనూ లేదు. కోరనూ లేదు''. కోమల నవ్వు మొహం మీద విచార రేఖలూ కనిపించాయి శంకరీబాయికి.

''పోనీ యిలా అనేదా? వలచి వలపించుకున్నావు'' అంటూ నవ్వింది.

''నో. నో. అదీ లేదు. వలపే లేదు యిద్దరి మధ్యా. నేను పావర్టీని గెలవాలని ట్రై చేస్తున్నా. బహుశా ఆకర్షణకు లోనై అది గెలుపు అనుకుని వుండాలి. ఆయనేమో యికనామీ పాటించి చౌకలో లభిస్తున్నదనుకుని వుండాలి'' నవ్వాలనే ప్రయత్నించింది కోమల.

''మరీ అన్యాయంగా అంటున్నావు కోమలా. తా వలచింది రంభా

తాముపొగిడింది గంగా అందామా. సమయానికెదుటున్నవాడు మొగుడూ'' నవ్వించాలనే అంటున్నది శంకరీబాయి.

''నో. నో. నేను రంభల్లోనూ లేను. నేను కంటబడ్డప్పుడాయనకు కళ్లజబ్బా లేదు. హాస్యాలాడుతూ తానే బైటపెట్టారా సంగతి. ''నిన్నెవడు పెళ్లాడుతాడూ? కట్నం కుమ్మరించలేవు. చింతాకులల్లే కళ్లు, పొట్టి, నలుపు, పెద్ద చదువు చదివి, పెద్ద జాబ్ చేస్తుంటే, ఆ జీతం, ఆ హోదా చూసి యెవడన్నా ప్రపోజ్ చేస్తాడేమో''.

''యెవడన్నా ప్రపోజ్ చేస్తాడేమో అని యెదురుచూడటం లేదుగానండీ, తరువాత మీ రన్నవి చేయాలనే నండీ నా ఆశ'' అని నేనూ నవ్వేశాను.

''నేను మా మామయ్యతో ఆఫీసర్స్ క్లబ్‌కి వెళ్లేదాన్ని, మామయ్య రమ్మీ ఆడేవారు. బ్రిడ్జ్ ఆడేవారు. నన్ను బిలియర్డ్స్ ఆడటం నేర్చుకోమన్నారు. గంటకు రూపాయి ఆయనే చెల్లించేవాడు. మామయ్య యింటికి పోదాం అనే దాకా నేను, దీపాల కింద నిలబడి బిలియర్డ్స్ ఆడుతూ వుండేదాన్ని. అదుగో ఆ దీపాల కింద బల్ల దగ్గర నిలబడి, తానూ ఆటలో పాల్గొంటూ ప్రముఖుడు కవ్విస్తూ నవ్విస్తూ జిగురులాగా అంటుకున్నాడు'' అన్నది కోమల.

''అదేం తెలుగూ కోమలా? నీ మీద కన్నేశాడందాము''.

''అబ్బే. లొంగదీయటం, లూర్ చేయటం, మస్కా వేయటం అనేపదాలు సరిపోతాయి''.

''మామయ్య గమనించలేదూ? చర్య తీసుకోలేదూ''

కుతూహలం కలిగి సంభాషణ పొడిగించింది శంకరీబాయి.

'' ఆయనకూ మస్కా వేశాడు. కొంత సేపు పేకాటలో పాల్గొంటూ మామయ్య పక్కన చేరి'' మీ అమ్మాయిని పెద్ద చదువు చదివించండి. బ్రైట్ స్టూడెంట్‌లాగా కనబడుతున్నది. పెళ్లి చేస్తారా?'' అనేవాడు.

''నే చేయనండి. అదే చేసుకోవాలి. నాకు యెదిగిన కూతుళ్ల

చదువులైపోవచ్చిన వారున్నారు. నా కప్పుడే గుండెల్లో రాయి పడింది''.

''అప్పుడే డిగ్రీలొచ్చేస్తున్నాయే భగవంతుడా! వరులు రాలేదే! నేనే చూడాలా! కట్నం పోయాలే! చదివించలేకే చస్తుంటే, పిల్ల చూపులకే యివ్వమంటున్నారు. పాటేమో లక్షతో మొదలై, పిల్ల ఒంటి మీద బంగారముంచాలనటంతో ముగుస్తున్నది. యెంతుంచాలో యేమిటో ఖర్మ. దీన్నెందుకు తెస్తున్నానంటే కారు తోలుతుంది'' అన్నాడు ముక్కలు పేరుస్తూ.

''అప్పుడే లైసెన్సు యిస్తారా? యిచ్చారా?''

''నేనే తెచ్చా. నా పిల్లలకి భయం. మగ పిల్లలు నాతో క్లబ్బుకి రారు. డ్రైవరు పద్దెనిమిదివందలడిగాడు. వాడిని అల్లుడిని చూసినట్లు చూడాలి. దీనికి నేనే డ్రైవింగ్ నేర్పాను. కారు మెకానిజం పుస్తకాలు చదివించా. నేను దగ్గరుండి బాగు చేయటం నేర్పాను. నాకు రాత్రిళ్ల చూపానటం లేదు. సిగ్నల్స్ అందరూ పాటించరు. ఇదుగో యీ ఫైనల్సు కాగానే టెక్నికల్ కోర్సుకి వెళ్తుంది అంతే''. ఆట ఆడుతూనే వున్నారు మామయ్య.

''అదేం ఆలోచనా. బాగా లేదు. మీరు గెజెటెడ్ ఆఫీసరు గాదూ? మేనగోడలు నాసి జాబ్ చేస్తే అగౌరవం గాదూ. నేను కాపిటల్ పెడ్తా పెద్ద చదువే చదవనీయండి. ఇపుడు చాలా స్కీములొచ్చాయి. అందులో ఇదొకటనుకుందాము''.

ఆట సాగుతూనే వున్నది. మామయ్య సిగరెట్ యాష్ట్రేలో పడేసి ''యేం స్కీములొచ్చాయి?'' అన్నారు.

''వృద్ధులకి పెన్షన్, నెలకి నాలుగొందలు పంపితే చాలు. శిశు విహార్. నిరుద్యోగులకు పనులు చూపుట. కోచింగ్ సెంటర్స్ నడుపుట. యేం చదువుతుందో అడగండి'' అన్నాడు జిగురు. మామయ్యకి మస్కా వేయటం, టోపీ పెట్టటం సులభం. ఆయనే పెట్టించుకుంటాడేమో నని నా అనుమానం''.

''కథ పక్క పుంతలు తొక్కుతున్నది కోమలా. తరచూ క్లీన్ చేస్తే యిలా అయిందా చీర? ఇస్త్రీ చేస్తుంటే అయిందా. పైన మరో బట్ట వేయ లేదూ యిస్త్రీ చేసేప్పుడూ? హంసలు వూడిస్తున్నాయే?''

''నా కివాళ ఓపికాలేదు. యీ మధ్య తీరికా లేదు. పనియెక్కువై, చుట్టాలు మర్యాదలు, వంటా, పెట్టు, ఫలహారం చేసి రైలు వేళకందించటం, నాన్ స్టాప్ పనితో వళ్లు హూనమైంది. నేను విరామ సమయంలో వీడియో ఫిల్ముు చిన్నవి తీయటం నేర్చుకున్నాను. ఆయన వూళ్లో లేనప్పుడు నా స్టూడెంట్సుకి డైలాగ్స్ నేర్పి మేకప్ చేసి తీశాను. కంప్యూటర్‌మీద చూడచ్చు. దూరదర్శన్ మీదా చూడచ్చు. ఆయన తనకు నచ్చిన కొత్త ఫిల్మ్ అద్దెకు తెచ్చి, దానిని చూపటం నేర్పారు. రాత్రిల్లే చూస్తారు. డిస్క్ అమర్చటం, తీసేయటం వచ్చింది. వినోదించవచ్చు'' అన్నది కోమల.

''సంతోషం కోమలా. టైం ఫిక్స్ చేయి. మేడమీదనా. డౌన్‌స్టైర్స్‌లోనా? మీ ఆయన వస్తారేమో'' అని లేచింది.

''రారు. కాజువల్ లీవు పడేసి పుట్టింటి కెళ్లారు. ఫాక్సు మెసేజ్ వచ్చింది. అది చూస్తూనే వెళ్లారు''.

''నీదంతా హాస్యం కోమలా. ఫిల్మ్‌కి యేమని పేరు పెట్టావు?''

''జ్ఞాపికలు. అది బాగా లేకపోతే మరపురాని ఘట్టాలు''

''చీర యెపుడు పెట్టాడు మరిది?''

''చీరల షాపులో దొంగలు పడ్డారు. ఈ ఆఫీసర్‌తో చెప్పుకున్నాడా షాప్ ఓనర్. పది లక్షల విలువ చేసే విలువైన చీరలు పోయాయిట. ఈ ఆఫీసరు నాల్గవరోజుకల్లా నేరస్థులను చీరలను పట్టించారుట. చీరలు స్వాధీనమైనైట. ఆ షాపు యజమాని సంతోషించి, ''అమ్మగార్ని తీసుకురండి'' అన్నాడుట. నన్ను పంపారు. ''మీకు నచ్చినదొకటి యెన్నిక చేసి తీసుకోండి'' అన్నాడు ఓనరు. ఇది నదరుగా కనబడి నేను దీన్ని యెన్నిక చేసి తెచ్చుకున్నాను''.

'' ఆఫీసర్ని నువే యెన్నిక చేశావా?''

''తాహతూ యోగ్యతా యేవీ నాకూ? మదిలో వేరే ఆలోచనలతో ఆయనే యెన్నిక చేశారేమో! తర్వాత తర్వాత కాలం గడుస్తుండగా అర్థమైంది. ఒక గొప్ప నర్తకి కూతురు తన తల్లి మెమోయర్సు పుస్తకం కంటబడితే దాన్ని పబ్లిష్ చేసింది. అలా మెమోయర్సులాగా వుంటుంది ఫిల్ము''.

2

'' ఇలా రహస్య సమావేశాలు జరిపే కన్న శాస్త్రాన్ని గౌరవిస్తే బాగుంటుందేమో'' అన్నది గళ్.

''నువ్వేమంటున్నావంటే, శాస్త్రీయంగా మా అమ్మకు దాస్యం చేస్తానంటున్నావు. ఆమె డామినేట్ చేస్తుంది. అవతలి వారి మాట నెగ్గనీయదు. డిక్టేటర్'' బోయ్ నవ్వాడు.

''కాని వేళల్లో మీటింగ్ కష్టమౌతున్నది. ప్రమాదిస్తుంది'' గళ్ కళ్లు తడి అయి పెదిమలదిరినై.

''అదా. అటువంటి డేంజర్ వుంటుందనే మెడికల్ హెల్పు అందుబాటులో వుంచా. కావాలా? నీవి గొప్ప ఆశయాలన్నావే'' నవ్వుతూ యెటో చూస్తూ అన్నాడు బోయ్.

''నావి విఘాతాలు లేని ఆశయాలంతే. మీరు నిడుపైన ఆశపెట్టి కట్టేస్తే, కట్టుబడ్డా'' అన్నది గళ్.

''యేమంటావింతకూ?'' విసుగ్గా అడిగాడు బోయ్. ''మీరుదహరించిన హెల్పు అశాస్త్రీయమే అంటున్నా'' అన్నది గళ్.

''ఘటా శ్రద్ధ అనే చిత్రం చూశాంగా యిద్దరం?'' కూలిపోతున్న పాక ముందు కూచుని శూన్యంలోకి చూస్తున్నది గళే. ''బోయ్ గాదు. వెలి అయింది గళే'' అని తలవంచుకున్నది.

''అవన్నీ పాత చింతకాయ ఐడియాస్. రంగు ఫిరాయిస్తున్నావే? మోసగించలేవు సుమా నన్ను. స్టడీస్ కంప్లీట్ చేయాలి. జాబ్ రెడీగా వున్నది, అదీ పథకం. యెలా నెరవేరదో చూస్తా'' అన్నాడు బోయ్ దర్పంగా.

''మీ పథకం యేమో గాని, శాశ్వతమైన నిందపడుతుందనీ, కింద వుమ్మేయరేమోననీ వెరుస్తున్నా''.

''నేనవన్నీ లెక్కజేయను. యెక్కడేం జరిగినా సరే. యెదిరించాలి. బి

ఫియర్‌లేస్ అన్నాడు స్వామి వివేకానంద'' వెళ్లిపోయాడు బోయ్'' స్వామి రహస్యంగా కలుసుకోమని చెప్పాడేమో చదవాలి'' అని కళ్లు తుడుచుకుంటూ వెళ్లిపోయింది గళ్.

బోయ్ యిప్పుడు మాన్ అయాడు. బెడ్‌రూమ్‌లో పచార్లు చేస్తూ అంటున్నాడు. నైట్ డ్రెస్. యెయిర్ కండిషన్డ్ బెడ్‌రూమ్ డబుల్ బెడ్ అందమైనది. గోద్రెజ్ బీరువా.

''నేను సజ్జనుడినీ, ధర్మాత్మా, మంచి మనసు గనక, నా సపోర్ట్ విత్‌డ్రా చేయలేదు. డిజోన్ చేయలేదు. పారిపోడు గదా అని దిలాసా నీకు. పాదుపరివనుకున్నా. మోడరన్‌లైఫ్ లీడ్ చేస్తావనుకున్నా/ ఇష్టమొచ్చినట్టు యేటా అలాగ్గా కని అక్కడ పెడ్తావనుకున్నా. వాళ్ల బాధ్యతలన్నీ నా నెత్తిన రుద్దావే గడుస్థనం అంటే అదే. నీ బాధ్యతలు నా నెత్తిన రుద్దుకుని మెప్పించాలా నిన్నూ? నీ స్తోమతా హోదా యెంత?''.

గళ్ యిప్పుడు వుమన్ అయింది. నెప్పులొస్తున్నాయి దెప్పులతో పాటు. లేబర్ సన్నగా మొదలై మూడవ రోజు గడుస్తున్నది డాక్టరొచ్చి చూసి అన్నది. ''వేవిళ్ల జ్వరంతో మూడు నెలలు, మలేరియాతో నాలుగు నెలలు వేగింది గదండీ తల్లీ, ఆఫీసర్! బిడ్డ మంచి ఆహారమందక, బలహీనంగా పెరిగి, యిపుడు పుట్టలేక అవస్థపడుతున్నది'' సిజేరియన్ ఆపరేషన్ యిపుడు ఫాషనైందండీ, చేస్తానంటే, చెమిటివాడల్లే చూస్తిరి''.

''అదో దండగ. కనేస్తుంది లెండి డాక్టర్. బిల్ చెల్లించాలి. అన్నీ నేనే చేయాలా? తనవాళ్లేమైనా రాలుస్తారా? పదిమంది పోగై మేస్తూ అన్నీ నేనే కొనితేవాలంటున్నారు. ఖర్చు పెట్టించటంలో నేర్పు సంపాయించటంలో లేదు'' అన్నాడు నవ్వుతూ.

''కలవారి బిడ్డకే ఆశ గొలిపి నిరాశ చేసి, పారిపోకుండా గుప్పిట్లో పెట్టుకోవాలి. గత జలసేతు బంధనం బర్త్ కంట్రోల్ ఆపరేషన్ చేయించుకునే కోమల మెడకు ఆశాపాశము కట్టకపోయారూ మేధావి గారూ?'' అన్నది డాక్టరు.

''నాకు ధనాశ లేదు. కావాల్సినంత సంపాయించుకుంటుందనీ, వాళ్ల

వాళ్లు ఆదుకుంటారనీ, వారి వద్దే వుండి ప్లీజ్ చేసుకుంటుందనీ రెక్కలొచ్చేవరకూ డబ్బు ఖర్చుకు వెరవకూడదని ప్లాను అంతా తారుమారై, బంధాలు పెరిగాయి. నాకు ఆ సమయంలో మంచి స్పెషలిస్ట్ సర్జన్ అందలేదు. వాడి కోసం అన్వేషిస్తుండగానే యీమె మూడవ డెలివరీ కొచ్చేసింది ధైర్యంగా. మింగ మెతుకు లేదుగా నీ మీసాలకు సంపెంగ నూనె'' అని నవ్వుతున్నాడు మాన్.

బిడ్డ కష్టపడి యెలాగైతేనేం డాక్టరమ్మ చేతిలో పడి కేరుమన్నది. ఆమె బొడ్డుకోసి, దూదిపెట్టి బిడ్డను భద్రంగా నీళ్లతో కడిగి తుడిచి అక్కడే వున్న యినప వుయ్యాల కొత్తది ఆకుపచ్చరంగు వేయబడినది, నర్సింగ్ హోమ్‌ది, అందులో మెత్తని పొత్తిళ్లలో వుంచింది. తల్లి చీర మరొకటి తీసికొంగు చింపి, మెడదూరే కన్నం వేసి పిల్లకు చొక్కాలాగా తొడిగింది. నాప్‌కిన్‌లాగా మరొక ముక్క వాడింది. మరోముక్క మెత్తనిది కప్పింది కంఠం వరకు.

మాన్ నిలబడి వుయ్యాలలోకి చూశాడు.

''మళ్లా పిల్లే? ఇప్పుడీ రంగులో వుంటే పెద్దయాక యీ వుయ్యాల రంగులోకి వచ్చేస్తుంది గదూ డాక్టర్?'' అని నవ్వాడు.

''యేదైనా ఇన్‌ఫెక్షన్ గానీ, డెఫిషెన్సీ గాని వచ్చి, పిల్లని ఎబ్‌డక్ట్ చేసి మీకానందం కలిగిస్తుందిలెండి ఆఫీసరు గారూ. రండి నన్ను దింపుదురు గాని, మరో కేసున్నది మరో నర్సింగ్‌హోమ్‌లో'' అని నవ్వుతూ పిల్చుకెళ్లింది.

అది చాలా పెద్ద బంగ్లా. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బదిలీ అయాడు. టైం చాలక బంగ్లా ఖాళీ చేయలేదు. మరొకటి ఖాళీది అందక రెంట్ కంట్రోలర్ ఆ బంగ్లాని గెజెటెడ్ ఆఫీసరుకి యెలాట్ చేశాడు. ఆఫీసరు వచ్చేశాడు. ''మీరు వర్రీ కావద్దు సార్. ఇల్లు పెద్దది. రెండు కాపరాలుండచ్చు. కంపెనీ కీపప్ చేద్దాం'' అన్నాడు.

''చాలా థాంక్స్ ఆఫీసర్! నేను తిరుత్తని వెళ్లి, ఐవేజు కలెక్ట్ చేసి తెచ్చుకోవాలి. తిరుపతి వెళ్లి డ్యూటీలో జాయినై ఛార్జ తీసుకుని, యింటికోసం వెతకమని చెప్పి పనిమీద వచ్చాను. అందాకా నా భార్య యిక్కడే వుంటుంది. ఒక్కడే అబ్బాయి తిరుత్తనిలో గ్రాండ్ పేరంట్సు వద్ద వుండి చదువుతున్నాడు. శలవులకి వస్తాడు. చెన్నైలో తల్లివేపు వాళ్లున్నారు. అక్కడికీ పోతాడు. నా

భార్యకి తోడూ కంపెనీ వుంటుంది. చిన్నబిడ్డలంటే చాలా యిష్టం'' యిద్దరూ హాలులో పేము కుర్చీల్లో వున్నారు. మధ్య బల్ల. గృహిణి టీ చేసి ట్రేలో వుంచి బిస్కట్లున్న ప్లేటుంచి తెచ్చి బల్ల మీదుంచి వెళ్లిపోతున్నది.

సిఐ భార్య తల చుట్టి హెయిర్ పిన్స్ అమరుస్తూ వాకిలి కానుకున్నది. గృహిణిని పరిశీలనగా చూసింది. నవ్వుతూ వచ్చి తానూ కుర్చీలో కూచున్నది.

టీ కప్పుల్లోకి వంచుతూ నవ్వుతూ అడిగింది.

''మళ్లీ కారీయింగ్?'' ఆమె మోడరన్ వుమన్ లాగా వుండి నాజూకైన నగలు కాసిని పెట్టుకున్నది. మైసూర్ జార్జెట్ చీరా బ్లౌజూ.

ఆఫీసరు నవ్వాడు. '' ఆమె కదే పని. కు.ని. పాటించదు. ఆర్థడాక్సు. రెలిజియస్ మైండ్'' అంటున్నాడు.

నాప్కిన్ మాత్రమున్న పిల్ల పారాడుతూ లేస్తూపడుతూ వచ్చింది. సి ఐ భార్య కుముదుని లేచి పిల్ల నెత్తుకున్నది. ముద్దు లాడింది. పిల్ల పెద్ద కళ్లతో చూసిందామెని. ఆవిడ చేతికున్న యెర్రవాళ్ల గాజులు తాకి చూసింది. రవ్వల నెక్లేస వంక చూసింది.

''కావాలా బేబీ!'' కుముదిని తన గాజు దూసి పిల్ల చేతికెక్కించింది. చెయ్యి పైకెత్తి గాజు పడిపోకుండా చేసింది పిల్ల. ''నాకిస్తా రా పాపని? పెంచుకుంటా. మా అబ్బాయికి పదహారోడు వచ్చేసింది. పాపకి కొత్తే లేదు. యేడవదు'' బిస్కెట్ తుంపి తినిపిస్తూ అన్నది.

''తప్పకుండానూ. పాపతోపాటు బొగ్గుల బస్తా గూడా యిస్తా బాయలర్ల్లో వేసేందుకు బొగ్గులు లేవని కంప్లెయింట్ చేస్తిరే'' నవ్వుతూనే అన్నాడు ఆఫీసర్.

''మరీ మోటు హాస్యం. నా వర్రీ తగ్గించారు. థాంక్స్. సామాను సర్దలేదు. కుక్ వెళ్లిపోయాడు. ప్యాన్ని యివ్వరు అంటున్నారు సి ఐ గారు. మీరు వుండమనంగానే యెంతో రిలీఫ యిచ్చింది మీ మాట'' అన్నది.

అలా రెండు కుటుంబాలూ స్నేహంగా వుంటుండగా ఆరు నెలలు గిర్రున తిరిగాయి. పాపను ''నీలిమా'' అని పిలిచేది సిఐ భార్య. ఆయన వస్తూపోతూ వుండేవాడు. నీలిమ అన్నం తినక నెట్టేస్తూ చూస్తూ వుండిపోతే కుముదిని ''లివర్ వ్యాధేమో?'' అని వర్రీ కావటం చూసి ఆఫీసర్ నవ్వాడు.

''నీలిమ ఉత్తరాయణ పుణ్యకాలం కోసం చూస్తున్నది'' అని నవ్వితే కుముదిని నొచ్చుకున్నది. డాక్టరమ్మ వచ్చి చూసిపోతున్నది. ఒక్కోసారి ఆఫీసరు హాస్యం మితిమీరితే కుముదిని కోపగించుకుని,

''మీ వేపు వాళ్లెవరైనా జబ్బుపడితే హాస్యాలాడుతూ నొవ్వేనాడుతారా? మెత్తగా వుంటూ, మెతకలాగా కనబడుతున్నది నీలిమ తల్లి. నేనైతే మిమ్మల్ని మన్నించను. మాటకు మాట అంటాను. మీ కామె యెందుకు లోకువైందో నాకు తెలియదు గానీ ఆఫీసరు గారూ, మరొకసారటువంటి మోటు హాస్యం వినదలుచుకోలేదు. గుర్తుంచుకోండి. మీరనేవి మీ వేపువాళ్లకి చెందుతాయి. కల్చరా అది? హద్దూ పద్దూ లేదు? నీలిమ పాలూ తాగటం లేదు. నవ్వటమూ లేదు. మలిగాళ్లమీద కూచుని చేతులెత్తేది యెత్తుకోమని. అదీ లేదు. యెప్పుడు నార్మల్సీ కొస్తుందో నీలిమ'' అన్నది.

''వేలెడు పిల్ల కోసం యేడవాలా'' అంటూ నవ్వుతూ వెళ్లి రన్నవుతున్న జీపెక్కాడాఫీసరు.

3

యేదో పార్టీకి వెళ్తే ఫొటోలు తీశారు. కలెక్టరుగారి భార్యా క్లబ్ ప్రెసిడెంట్. సెక్రటరీ శారద. ఇద్దరూ వచ్చి మెంబర్‌షిప్ డబ్బు కలెక్ట్ చేసి ప్రింట్సు చూడమని యిచ్చి వెళ్లారు. నేలమీద కూచుని చిన్నబిడ్డ బొమ్మలతో ఆడుతున్నాడు. నీలిమ బొమ్మల పియానో మెట్లు నొక్కుతూ చూస్తున్నది. సాయంకాలం చల్లబడింది. పొద్దువాటారుతున్నది.

ఆఫీసర్ పేము సోఫాలో కూచుని పేపర్ తిరగేస్తున్నాడు.

''డాక్టరమ్మ సరస్వతితో స్నేహంగా వుండాలి. నీకీ మాటు ప్రెగ్నెన్సీ మరీ

దగ్గరైంది. వీగ్గా వున్నావు. రక్తమూ తక్కువే యెబార్షన్ చేయించండి. యేం భయంలేదు. నేను హామీ యిస్తాను అంటున్నది డ్యాక్టరమ్మ. ఆమె అంత సింపతీ చూపిస్తుంటే ఆమె వేపే చూడవేం? అమ్మా అని పిలుస్తూ భోజనానికుండమనాలి'' అన్నాడు.

'' ఆమె అమ్మ కాలేదే. కన్య. నా కన్న చిన్నదంటిరే మీరు. డిగ్రీలు కొట్టాలని వుబలాట పడింది గాని పిల్లల్ని కనాలని వుబలాట పడలేదని మెచ్చుకుంటిరే. అమ్మా అని పిలిస్తే అసహ్యించుకోదూ'' తలెత్తకుండానే అన్నది గృహిణి.

'' ఈ పూట, సరస్వతీ, ఉమా అనే మరో డ్యాక్టరమ్మా భోజనానికొస్తారు. నేను వెళ్లి తెస్తాను. వేడివేడి అన్నం పొడిపొడిగా వుండాలి. నీకు కరుళ్ళు కరుళ్ళుగా వడ్డించటం అలవాటు. నీవు వండే యిగిరి కలు ఆపేయ్. బంగాళా దుంప వేపడం, ఫిప్సూ, ఆమ్లెట్ వేడిగా, తీయని గడ్డ పెరుగు ఆవకాయ కావాలన్నారు. ఆవకాయతో గుండ బాగా వడ్డించాలిట''

''అలాగే. అలాగే. గుర్తుంచుకుంటా'' అన్నది ఫొటోలు చూస్తూనే వున్నది.

'' ఓ పక్షం క్రితం పార్టీ యిచ్చాము. అప్పుడాలీసంగా వచ్చారు అతిథులు. మిసెస్ చంద్రావతీపాల్ తొందరపెడుతూనే వున్నది'' అమ్మకి చానా కోపమొస్తుంది. పోవాల. రాండి'' అని వేగిరపెడుతూనే వున్నది. పని తెమలాలి. మిసెస్ పాల్ తాను చేసిన ఐటమ్స్ బల్లమీదుంచింది. వేడిగానే వున్నాయి. ఈగిల్ ఫ్లాస్కులో వుంచి తెచ్చింది. నువ్వు వడ్డించుకుని తినలేదేం. చూసి వెళ్లిపోయావు. చాదస్తమంతా బైటపెట్టావు'' అంటున్నాడు పేపరడ్డమున్నది మొహానికి.

ఫొటోలు కవర్లో సద్దుతూ తలెత్తి నవ్వుతూ అన్నది గృహిణి.

'' ఆమె కోడిపలావ్, కైమా వుండలు, మరేదో తెచ్చింది. కోడితలకాయా, కోడికాళ్లూ చీకటం చాతకాదు నాకు. నేర్చుకుంటాలెండి ఆఫీసరు గారు. నేను వెజిటేరియన్న్ని''.

''సనాతనిస్టు. హైక్లాస్ అని పొగరు. డీసెన్సీ యేదీ? మా వాళ్లొస్తే మాటకు మాట సమాధానం యిచ్చావు. విసిరివేయటం. నీవు చేయలేవని కుక్‌ని తెస్తే అన్నీ అందించక, అడిగేదివ్వక వెళ్లిపోయావుట. ఫార్మల్‌గానైనా బిహేవ్ చేయచ్చునే'' అని దీర్ఘం తీశాడు.

''ఫార్మాలిటీసన్నా అందకపోతాయా అని వూహిస్తు వచ్చారా?'' అంటూ లేచింది గృహిణి. ఫొటోలన్ని బొత్తిపెట్టె కవర్లో సద్దింది.

'' ఓ చిన్న జాబ్‌కే యింత పొగరూ? మరిచావేమో అదిప్పించింది నేనే. ఒకమ్మాయి మెటర్నిటీ లీవ్ మీద వెళ్తే నీకిప్పించానంతే. ఇగో పెరగనీకు. మీ వాళ్లెందుకొచ్చారు? యెంతందిస్తావు?'' అంటున్నాడాఫీసర్.

శంకరీబాయ్ బెడ్‌రూమ్‌లోంచి కేక వేసింది. ''కోమలా! డిస్క్ పూర్తయింది. మరొకటి యెడ్జెస్ట్ చేస్తావా? రెడీగా వున్నదా?''

కోమల చల్లని సాఫ్ట్ డ్రింక్ స్ట్రా వేసి ట్రేలో వుంచి, చిప్, కాసిని క్రీమ్ బిస్కట్లు, రెండు సాసర్లో వుంచి తెచ్చింది. యెదురుగా వుంచింది.

''తీసుకోండి. యెంత తాలిమీ ఓరిమీ వున్నది మీకూ?'' యెదురుగా కుర్చీలో కూచున్నది.

''థాంక్స్ కోమలా. ఫాన్ తిరుగుతున్నా గదిలో వేడిగానే వున్నది''.

'' ఇంకోసారి మరొక యెపిసోడ్ చూతురుగాని'' అన్నది కోమల.

'' అలా నొవ్వనాడుతూ వుంటే ప్రేమ మాసిపోతుందని తెలియదూ? అది సహజ గుణమేమో. కొందరంతేలే'' డ్రింక్ సిప్ చేస్తూ ఛిప్స తింటూ బిస్కట్ తింటున్నది శంకరీ బాయ్.

''చెప్పనే. ప్రేమ అనేది భ్రమ. ఆ భ్రమ ప్రమాదంలో కీడ్చింది. మానవులంతా ఆశాజీవులే. యేదో ఆశిస్తూ బతుకుతారు''.

''నిజమే. పోతాను కోమలా. మళ్లా వస్తా. మరొక డిస్క్ వున్నదన్నావు. చూడాలని వున్నది'' అని లేచింది శంకరీబాయ్.